


## పరంజ్యోతి

**2007లో** ఓ రోజు శ్రీ జయశీలరావు నాకు ఫోన్ చేసి రాష్ట్ర ఎండోమెంట్స్ శాఖ ఆరాధన అనే పత్రికని తీసుకువస్తోందని, దాన్లో తను కొత్తగా ఎడిటర్‌గా చేరానని, నానించి ఆధ్యాత్మిక రచనలు కోరి కలవాలని అనుకుంటున్నానని, ఓసారి ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పారు. తమ పత్రికకి ఏదైనా రాయమని, తాము మేగ్జిమమ్ ఇచ్చే పారితోషికం వెయ్యిన్నూట పదహార్లని చెప్పారు. నాకు ఇష్టమైన ఆధ్యాత్మిక టాపిక్ కాబట్టి ఆయన మాటని కాదనలేకపోయాను. వివేకధార అనే ఆధ్యాత్మిక శీర్షికని కొన్ని నెలలు ఆరాధనలో రాసాక పరంజ్యోతి అనే ఆధ్యాత్మిక నవలని రాసాను. తక్కువ కాలంలోనే ఆరాధన సర్క్యులేషన్‌ని 5,000 నించి 10,000కి పెంచాక, ఆ నవల పూర్తికాకుండానే జయశీలరావు వ్యక్తిగత కారణాల వల్ల ఆ పోస్ట్ నించి తప్పుకుని వైజాగ్ వెళ్ళిపోయారు.




బెంగాల్లో నిజంగా జరిగిన భావల్ సన్యాసి జీవిత కథ నా చిన్నప్పుడు ప్రజామతలో సీరియల్ వచ్చింది. మా అమ్మ మాకు దాన్ని చదివి చెప్పేది. నాకు అది ఆధ్యాత్మిక నవలగా రాయచ్చని అనిపించింది. 2009లో అమెరికా వెళ్ళినప్పుడు అమెజాన్‌లో భావల్ సన్న్యాసి కేసుకి సంబంధించిన ఓ ఇంగ్లీష్ పుస్తకాన్ని కొన్నాను అందులో ఆనాడు జరిగింది యథాతథంగా తారీకులతో, కోర్టు తీర్పులతో సహా ఇచ్చారు. దాని ఆధారంగా పరంజ్యోతి కథని అల్లుకున్నాను. అంటే ఈ నవల్లోని కథకి ప్రేరణ దాదాపు 80 ఏళ్ళ క్రితం బెంగాల్‌లో నిజంగా జరిగిన ఆ సంఘటనే.

బెంగాల్‌లోని అతి ఐశ్వర్యవంతమైన భావల్ సంస్థానాధీశ్వరుడి రెండో కుమారుడు రామేంద్ర నారయణ్ రాయ్ చౌదరి. అతన్ని అంతా ప్రేమగా మేజో కుమార్ అని పిలిచేవారు. వ్యసనపరుడైన కుమార్ వివాహం అయ్యాక, డార్జిలింగ్‌లో ఆర్సెనిక్ విషప్రయోగంతో చితికి చేరాడు. చితి పూర్తిగా తగలబడకుండానే అది ఓ వాగులో

కొట్టుకుపోయింది. బాబా ధరమ్ దాస్ అనే మహాత్ముడు అతన్ని రక్షించి బతికించాడు. (ఈ ధరమ్ దాస్ శిష్యుడే స్వామి రామా) గతం మరిచి తన గురువు ధరమ్ దాస్‌తో కుమార్ పుష్కర కాలం సాధువుగా సంచరించి, గతం గుర్తుకు రాగానే భావల్ సంస్థానానికి తిరిగి వచ్చాడు. అతన్ని అంతా గుర్తు పట్టారు. ఐతే అతన్ని సంస్థానాధీశుడిగా వారసులు అడ్డుకోవడంతో అతను తన సంస్థానం తనకి చెందాలని 1909లో కోర్టులో కేసు వేసాడు. ఈ కేసు వ్యాజ్యం అనేక కోర్టుల్లో జరుగుతూ ఆనాటి లండన్‌లోని ప్రైవీ కౌన్సిల్‌కి చేరుకుంది. అది మన సుప్రీం కోర్టులాంటిది. జూలై 1946లో ప్రైవీ కౌన్సిల్ తీర్పు చెపుతూ సంస్థానానికి కుమారే హక్కుదారుగా తీర్పుని ఇచ్చింది.

భావల్ సన్యాసి కేసు భారతదేశంలో అత్యధిక కాలం విచారించబడ్డ సంచలనాత్మక ఖ్యాతి చెందింది. దీన్ని మన లా టెక్ట్ బుక్స్‌లో కూడా పాఠంగా చేర్చారు. ఐతే తీర్పు వచ్చిన కొద్దికాలానికే మేజో కుమార్ మరణించాడు. ఈ చరిత్ర ఆధారంగా అనేక భాషల్లో పుస్తకాలు, సినిమాలు వచ్చాయి. ఇది ఆరంభించినప్పుడు నాకు తెలీదు కానీ తర్వాత తెలిసింది రాజా రమేష్ సినిమా భావల్ సన్యాసి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించబడిందని. ఆ భావల్ సన్యాసి కేసు నేపథ్యంగా తీసుకుని ఆధ్యాత్మిక విషయాలని చొప్పించి 'పరంజ్యోతి'ని రాసాను. కారణం ఈ సబ్జెక్ట్‌లో ఆధ్యాత్మికతకి, నాటకీయతకి పుష్కలంగా చోటుంది. కుమార్ పేరుని విజయరామరాజుగా పెట్టాను. గోదావరి జిల్లాలో గోదావరి ఒడ్డున గల ఓ ఊహామాత్రపు నెమలికొండ సంస్థానంలో ఈ కథ జరిగినట్లుగా రాసాను.

క్లుప్తంగా కథ. తల్లిలేని రామరాజుని గారాబంగా పెంచడంతో తాగి తందనాలాడే అల్లరి చిల్లరివాడుగా రూపొందాడు. అతని భార్య తన అన్నతో కలిసి అతనికి విషం పెట్టి చంపేస్తుంది. అతని చితి పూర్తిగా కాలకుండానే పైన పడ్డ వర్షంతో అకస్మాత్తుగా వచ్చిన వరదలో నదిలో కొట్టుకుపోతుంది. దానిరాక గురించి సహజానంద స్వామి అనే మహాత్ముడు ముందే తన శిష్యులకి చెప్పి, రామరాజు శవాన్ని తీసుకురమ్మని పంపించాడు. అతని శవాన్ని ఓ గుహలో ఉంచి కాయకల్ప చికిత్స చేసి బతికించి అతనికి పరంజ్యోతి అనే పేరు పెట్టాడు. గతం గుర్తులేని, చిన్నపిల్లాడి దశలోని పరంజ్యోతి మళ్ళీ అన్నీ అభ్యసించాడు. నిరంతరం దైవ చింతనతో తన గురువుని అంటి పెట్టుకునే ఉన్న పరంజ్యోతికి ఓ రోజు గతం గుర్తొస్తుంది. ఆ తర్వాత ఏమైంది అన్నది నవల్లోని రెండో భాగం.

ఆ నవల్లో కథ చెపుతూ ఆధ్యాత్మిక, అద్వైత పరమైన చాలా అంశాలని చేర్చాను. ఉదాహరణకి కొన్ని.

"ప్రేమకి గొలుసులు ఉండకూడదు. ఎవరినీ నువ్వు నిన్ను ప్రేమించేలా చేయలేవు. నిన్ను ప్రేమించాలని వారు నిర్ణయించుకుంటేనే నిన్ను ప్రేమిస్తారు. అదే నిజమైన ప్రేమ. దేవుడు కూడా నీ విషయంలో ఇలాగే ప్రవర్తిస్తాడు. నిన్ను తనని ప్రేమించే విషయంలో గొలుసులతో కట్టడి చేయడు. తమ దైవాన్ని ప్రేమించమని ప్రచారం చేసే కొందరు మతాధికారులని దేవుడు తయారు చేయలేదు. నిజంగా తన మీద ప్రేమ కలవారే తనని ప్రేమించాలన్నది దేవుడి ఆదర్శం."

"ఓ తాతయ్య తన అయిదేళ్ళ మనవడిని మిగిలిన పిల్లలతో ఆడిస్తున్నాడు. వారంతా ఆడేది దాగుడు మూతల ఆట. తన మనవడ్ని ఓ చోట దాచాడు. కొద్దిసేపయ్యాక మనవడు దాక్కున్న చోటునించి బయటకి వచ్చి, తన కోసం ఎవరూ వెదకడం లేదని గ్రహించాడు. వెంటనే ఏడుస్తూ తాతయ్య దగ్గరకి వెళ్ళి చెప్పాడు, 'తాతయ్యా! దాక్కున్న నన్ను ఎవరూ వెదికి కనుక్కోవడంలేదు.' దేవుడి కథ కూడా సరిగ్గా ఇదే. తనని అంతా కనుక్కోవాలని ఆయన దాక్కున్నాడు. కానీ ఆయనకోసం తక్కువ మంది వెదుకుతున్నారు. తనని వెదికే వాళ్ళకి త్వరగా దొరకాలనే చూస్తాడు."

రామరాజు తన కొడుక్కి చెప్పే బోధ ఇది.

"పురాణాల్లోని కొందరి వ్యక్తుల పేర్లు చెప్పగానే మనసుకి ఓ ఆలోచన వస్తుంది. కర్ణుడనగానే దానం గుర్తుకు వస్తుంది. సీత అనగానే పాతివ్రత్యం, రాముడనగానే ఏకపత్నీవ్రతం, రావణాసురుడు అనగానే కాముకత్వం, హనుమంతుడు అనగానే భక్తి, సేవాపరత్వం గుర్తుకు వస్తాయి. అలాగే మనం మరణించాక మనకి తెలిసిన వాళ్ళకి కూడా మన పేరు వినగానే మన గురించి ఓ ఆలోచన వస్తుంది. అది

'కాముకుడు, జూదరి, తాగుబోతు, మోసగాడు, అబద్ధాలకోరు, గర్వపోతు, తిండిపోతు'లాంటివైతే మంచిదా? లేక 'నిజాయితీ పరుడు, నిజం చెప్పేవాడు, మాట తప్పనివాడు.' లాంటివా? నీ తర్వాత నీ గురించి ప్రపంచం నిన్ను ఎలా గుర్తుంచుకోవాలని నువ్వు కోరుకుంటున్నావో, ఆ ప్రకారం నువ్వు జీవించి ఉన్నప్పుడే నడుచుకోవాలి. మన నడతని బట్టే మనల్ని ప్రజలు గుర్తుంచుకుంటారు."

"ప్రపంచంలో పాము వంకరటింకరగా ప్రవర్తిస్తుంది. దాన్ని బిలంలోకి వెళ్ళే పాములా సూటిగా ధర్మంవైపు పోనివ్వాలి. "

ఓసారి ప్రసన్నానంద స్వామి గంగోత్రిలో భగవద్గీతలోని భక్తి అధ్యాయాన్ని ప్రవచనంగా చెప్పినప్పుడు దానికి హాజరయ్యాను. ఆయన ప్రవచనం అయ్యాక పాడించిన పాటని రాసుకుని ఈ నవల చివర్లో వాడాను. అనేక చరణాలు గల అది ఇలా మొదలవుతుంది.

**నిర్దోషంబగు కర్మాచరణము**

**నిర్దోషంబగు కర్మాచరణము**

**నిశ్చల భక్తిలో తన్మయ భావము**

**నిస్సంకల్పిత ధ్యాన విధానము**

**నిఖిలాధీశ్వర ప్రసాదించరా**

ఆరాధనలో సీరియల్ పూర్తయ్యాక మే 2010లో పుస్తకంగా లిపి పబ్లికేషన్స్ ప్రచురించింది. వెల రూ 120 /- రెండో ముద్రణ మార్చ్ 2012లో వెలువడింది.

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

Post your comments